ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు

భూపాలపల్లి జిల్లాలో 13 పరీక్ష కేంద్రాలు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 2 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సోమవారం నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి బీ వెంకన్న తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్‌కు 780 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, ఇందుకు మొత్తం 13 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రాష్ట్ర ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు 5 పరీక్ష కేంద్రాల్లో ఫస్ట్ స్పెల్, 4 పరీక్ష కేంద్రాల్లో సెకండ్ స్పెల్, 4 పరీక్ష కేంద్రాల్లో థర్డ్ స్పెల్‌ను మొత్తం 20 రోజులపాటు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతి ప్రాక్టికల్ పరీక్ష కేంద్రంలో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, వీటి ద్వారా రాష్ట్ర అధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు. ప్రశ్నపత్రం ఏ రోజుకారోజు ప్రిన్సిపాల్ లాగిన్‌కు మెయిల్‌లో వస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే ల్యాబ్‌లకు కావాల్సిన రసాయనాలు, సామగ్రి కోసం ప్రభుత్వం రూ.25వేలు మంజూరు చేసినట్లు ఆయన వివరించారు.

నష్టపరిహారం ఇచ్చిన తర్వాతే మట్టి పోసుకోవాలి

ఓసీ త్రీలో లారీలను అడ్డుకున్న భూ నిర్వాసితులు

గణపురం, ఫిబ్రవరి 2 : మండలంలోని ధర్మారావుపేట రెవెన్యూ గ్రామ శివారులోని సింగరేణి ఓసిత్రీలో భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులు కొండం బక్కయ్య, కాసాని సువర్ణ, వంగ పోశయ్య ఆదివారం ఓసిత్రీలో మట్టి డంపింగ్ చేసే లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా, గ్రీవెన్స్ సెల్‌లో దరఖాస్తు చేసుకున్నా ఇంతవరకు తమకు నష్ట పరిహారం అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాసులకు కక్కుర్తి పడి భూమి లేని రైతులకు, లంచాలు ఇచ్చిన వారికి డబ్బులు అకౌంట్లలో వేస్తున్నారన్నారు. అక్రమాలకు పాల్పడిన అధికారులపై విచారణ జరిపి చర్య తీసుకోవాలని, తమ భూములకు వెంటనే నష్టపరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు.

చిన్నారిని ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర

వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 2 : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు కాశింపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన నరేశ్ ఐఏఎస్-ప్రవళికల కుమార్తె ఇషా ఆద్రిక మొదటి పుట్టిన రోజు వేడుకల్లో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొని ఇషా ఆద్రికను ఆశీర్వదించారు. అనంతరం మంజూర్‌నగర్ ఏఎస్ఆర్ గార్డెన్‌లో జరిగిన కొంపెల్లి గ్రామానికి చెందిన పాతూరి స్వరూప-బుచ్చిరెడ్డి కుమారుడు శ్రీకాంత్-పావణి వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో భూపాలపల్లి మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మహదేవపూర్(కాళేశ్వరం), జనవరి 2 : కాళేశ్వరం సబ్‌స్టేషన్ పరిధిలోని కాళేశ్వరం, మెట్‌పల్లి గ్రామాల్లో 11కేవీ విద్యుత్‌లైన్ మరమ్మతుల నేపథ్యంలో నేడు(సోమవారం) ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ అధికారి శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గిరిజనులకు కేంద్ర బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం

కృష్ణ కాలనీ/మహాముత్తారం, ఫిబ్రవరి 2 : కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో గతంలో ఎన్నడూ లేనివిధంగా గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి తీవ్ర అన్యాయం జరిగిందని సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ నాయక్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పొలం రాజేందర్ ఆదివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. వికసిత్ భారత్ అంటూ ప్రచారాన్ని ఊదరగొట్టిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం గిరిజనులను మరింత పేదరికంలో నెట్టే విధంగా బడ్జెట్ కేటాయింపులున్నాయని విమర్శించారు. గిరిజన సబ్ ప్లాన్‌కు రూ.3,54,574 కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.1,29,249 కోట్లు మాత్రమే కేటాయించి, గిరిజనులకు తీరని అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల్లో పేదరికం, అనారోగ్యం రోజురోజుకూ పెరుగుతోందని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసిన తరుణంలో కూడా ఉపాధి హామీ పథకం, ఆరోగ్యం వంటి కీలక రంగాల నిధుల్లో కోత పెట్టడం కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని సంతోష్‌నాయక్ తీవ్రంగా ఆరోపించారు.

కార్పొరేట్లకు దోచిపెట్టే బడ్జెట్

గోవిందరావుపేట, ఫిబ్రవరి 2 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా, సామాన్య ప్రజలకు వ్యతిరేకంగా ఉందని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తుమ్మల వెంకట్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం పస్రా గ్రామంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతు వ్యతిరేక బడ్జెట్ అని, రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొదిళ్ల చిట్టిబాబు, నాయకులు గుండు రామస్వామి, కొట్టె కృష్ణారావు, అంబాల పోశాలు, మంచాల కవిత, శ్రీరామోజు సువర్ణ, సామ మహేశ్, చల్ల పాండురంగ ఉన్నారు.

పంట చుట్టూ కరెంట్ తీగలు అమర్చితే చర్యలు

ములుగురూరల్ : రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

ములుగురూరల్/గోవిందరావుపేట, ఫిబ్రవరి 2 : అడవి పందుల బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు, వేటగాళ్లు పంటల చుట్టూ బైండింగ్ తీగలను ఏర్పాటు చేసి కరెంట్ అమర్చినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ములుగు సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వరరావు, గోవిందరావుపేట ఎస్సై అచ్చా కమలాకర్ హెచ్చరించారు. ఆదివారం ములుగు మండలంలోని అబ్బాపురం, శ్రీరాములపల్లి, కుమ్మరిపల్లి, బాణాలపల్లి శివారులోని పంట పొలాలను వారు పరిశీలించారు. బైండింగ్ తీగలు అమర్చి ఉండటాన్ని చూసి రైతులను పిలిపించి వాటిని తొలగించాలని సూచించారు. పస్రా ఎస్సై అచ్చా కమలాకర్ పాత నేరస్తులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. పంటల చుట్టూ కరెంట్ తీగలు అమర్చడం, ఉచ్చులను పెడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

గోరికొత్తపల్లిలో కరెంటు వైరు, స్టార్టర్ చోరీ

రేగొండ, ఫిబ్రవరి 2 : గోరికొత్తపల్లిలో కరెంటు వైరుతోపాటు స్టార్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. రైతు ఆకుల రమేశ్ గోరికొత్తపల్లి శివారులో వ్యవసాయ బావి వద్ద విద్యుత్ మోటారుకు వైరు, స్టార్టర్ అమర్చి సాగునీరు అందిస్తున్నాడు. అయితే, రెండు రోజులుగా అతడు బావి వద్దకు వెళ్లలేదు. ఆదివారం ఉదయం వెళ్లే సరికి విద్యుత్ వైరుతోపాటు స్టార్టర్ కనిపించలేదు. గతంలో కూడా పలువురి రైతుల కరెంట్ మోటర్లు అపహరణకు గురయ్యాయి.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

స్లాబు వేశారు.. వదిలేశారు..!

- నిలిచిన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం
- నిధుల మంజూరులో జాప్యం
- ఐటీడీఏ క్వార్టర్‌లోనే ఆఫీస్ నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు

ఏడాదిగా అసంపూర్తిగా ఉన్న భవనం

ఏటూరునాగారం, ఫిబ్రవరి 2 : మండలంలో తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు ఏడాదిగా ముందుకు సాగడం లేదు. భవన నిర్మాణంలో నిర్లక్ష్యం కనబడుతోంది. 2023లో ఏటూరునాగారంలో తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, టెండర్లు నిర్వహించింది. ఇక్కడ ఉన్న కార్యాలయ భవనం కూలిపోయే దశలో ఉండగా, దాన్ని పూర్తిగా తొలగించి, రూ.90లక్షలతో భవన నిర్మాణం కోసం ఎస్టిమేట్ తయారు చేయగా తొలి విడతగా రూ.60లక్షలను మంజూరు చేసింది. దీంతో సుమారు 22 పిల్లర్లతో 12 గదులు ఉండేలా నిర్మాణం ప్రారంభించారు. అయితే టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఏడాది క్రితమే స్లాబు వేశాడు. ఆ తర్వాత పనులకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదు. దీంతో స్లాబు వరకు పనిచేసిన కాంట్రాక్టర్‌కు కొంతమేరకు బిల్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. పనులు చేయకుండా కాంట్రాక్టర్ కూడా చేతులెత్తేశాడు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దిక్కు మొక్కు లేకుండా భవనం వెక్కిరిస్తోంది. ఐటీడీఏ కార్యాలయం పక్కనే ఈ భవన నిర్మిస్తున్నారు. పనుల పర్యవేక్షణ కూడా పక్కనే ఉన్న ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులకు అప్పగించారు. రూ.కోట్లు మంజూరు చేస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ప్రకటిస్తున్న ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు అవసరమయ్యే ఈ భవనాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. ఇక్కడ ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని నాలుగేళ్ల క్రితమే పీఎంఆర్‌సీ ఆవరణలోని ఒక భవనంలోకి మార్చారు. ఇదే ప్రాంగణంలో గిరిజన మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయడంతో తట్టాబుట్ట సర్దుకుని అధికారులు ఆఫీసును ఐటీడీఏ క్వార్టర్‌లోకి మార్చుకోవాల్సి వచ్చింది. మరి ఈ భవనాన్ని ఎవరికైనా కేటాయిస్తే మళ్లీ ఎటుపోవాలో కూడా తెలియని స్థితిలో రెవెన్యూ అధికారులు ఉన్నారు. ఇక ప్రస్తుత కార్యాలయ భవనం అసౌకర్యంగా ఉండడంతో అధికారులు తిప్పలు పడుతూ విధులు నిర్వర్తిస్తున్నారు. తహసీల్దార్ చాంబర్ ఇరుగ్గా ఉంది. సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసుకునేందుకు కూడా తహసీల్దార్ అసౌకర్యానికి గురవుతున్నారు. పురాతన భవనం కావడంతో వర్షాకాలం వస్తే అక్కడక్కడ కురుస్తున్నట్లు సమాచారం. ఏటూరునాగారాన్ని రెవెన్యూ డివిజన్‌గా గత ప్రభుత్వం ప్రకటించగా, ఈ ప్రభుత్వం కూడా ఆమోద ముద్ర వేసింది. తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణంలోనే జాప్యం జరుగుతుంటే ఇక ఆర్డీవో కార్యాలయ భవన నిర్మాణం ఇప్పట్లో అవుతుందా? అనే సందేహం ప్రజల్లో వ్యక్తమవుతోంది. మండలానికి పెద్ద దిక్కుగా ఉండే కార్యాలయాల భవన నిర్మాణం విషయంలో ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. వెంటనే భవనం పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

నేటి ప్రజావాణి రద్దు

ములుగురూరల్/భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 2 : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ములుగు, భూపాలపల్లి జిల్లాల్లోని కలెక్టరేట్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఆయా జిల్లాల కలెక్టర్లు టీఎస్ దివాకర, రాహుల్‌శర్మ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. విషయాన్ని గ్రహించి ప్రజలు సహకరించాలని వారు కోరారు.

దుక్కిటెద్దును పొడిచిన దుండగులు

పలిమెల, ఫిబ్రవరి 2 : మండలంలోని బూర్గుగూడెం గ్రామంలో దుక్కిటెద్దును గుర్తు తెలియని దుండగులు బరిసెతో పొడిచారు. స్థానికుల కథనం ప్రకారం.. దమ్మూరు గ్రామానికి చెందిన రైతు జీడీ కన్నయ్య రెండు దుక్కిటెద్దులు ఉన్నాయి. రోజువారీ మాదిరిగానే పశుగ్రాసం తినడానికి దమ్మూరు గ్రామానికి అనుబంధ గ్రామమైన బూర్గుగూడెంలోని గోదావరి సమీపంలోని పచ్చిక బైళ్లకు వెళ్లాయి. రెండింటిలో ఒకటి శనివారం సాయంత్రం ఇంటికి రాగా మరొకటి రాలేదు. ఎంత తిరిగినా ఎద్దు ఆచూకీ దొరకలేదు. ఆదివారం ఉదయం గోదావరి వైపు వెళ్లి చూడగా ఎద్దు ప్రేగులు బయటకు వచ్చి, చావు బతుకులు మధ్య ఉంది. వైద్యుడికి చూపించగా ఒకటి, రెండు రోజులు మాత్రమే బతికే అవకాశం ఉందని తెలిపారు. దుక్కిటెద్దును దుండగులు పొడిచారని కన్నయ్య కన్నీరు పెట్టాడు. ఎద్దు విలువ రూ.50 వేలు ఉంటుందని, న్యాయం చేయాలని కోరాడు.

దుకాణాలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

రోడ్లపై మటన్‌షాపుల తొలగింపు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 2 : మండల కేంద్రంలోని ప్రధాన రోడ్లపై ఇష్టం వచ్చినట్లుగా ఆదివారం ఏర్పాటు చేసిన మటన్ షాపులను గ్రామ పంచాయతీ ఉద్యోగులు తొలగించారు. రోడ్లపై మాంసం విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయడం, వాహనాలు రోడ్లపై పార్కింగ్ చేయడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పంచాయతీ కార్యదర్శి రమాదేవి పేర్కొన్నారు. మటన్‌షాపులకు కేటాయించిన స్థలంలోనే ఏర్పాటు చేసుకుని విక్రయించాలని సూచించారు. ఇష్టం వచ్చినట్లు ఏర్పాటు చేస్తే గ్రామ పంచాయతీ తరపున చర్యలు తీసుకుంటామన్నారు. తొలగింపులో పంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు.

'అట్రాసిటీ కేసు నమోదు చేయాలి'

కృష్ణ కాలనీ, ఫిబ్రవరి 2 : మొగుళ్లపల్లి ఎస్సైపై ఉన్న తాధికారులకు తప్పుడు ఫిర్యాదు చేసిన సంపత్‌రావు, శశిధర్‌రావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరి రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో వీరిద్దరికి పిన్నింటి రాజేశ్వరరావుతో గొడవలున్నట్లయితే వారు వారు చూసుకోవాలి కానీ, ఒక సిన్సియర్ అధికారి అయిన ఎస్సై అశోక్‌ను లాగడం తప్పని విమర్శించారు. భూపాలపల్లి జిల్లాలో దళిత అధికారులకు రక్షణ కరువైందని, మరోసారి ఇలాంటి ఘటనలు జరుగకుండా ఉండాలంటే సంపత్‌రావు, శశిధర్‌రావుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

అంతిమయాత్రలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 2 : మండలంలోని బుట్టాయిగూడెంలో బీఆర్ఎస్ కార్యకర్త ఆసరెల్లి సత్యం భార్య బానక్క గుండెపోటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. గ్రామంలో బానక్క బీఆర్ఎస్ మొదటి సభ్యత్వం తీసుకోవడమే కాకుండా పార్టీకోసం నిత్యం పనిచేసినట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కావిరి పద్మ, చిన్నికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దుర్గం నారాయణ, బక్కయ్య, నాయకులు వెంకటయ్య, పోలయ్య, దుర్గారావు, నాగార్జున, నాగరాజు, తిరుపతి, అంకులు, కోటేశ్, నర్సింహారావు, రాజంబాబు, పెద్దల వెంకటయ్య పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

రేగొండ, ఫిబ్రవరి 2 : చర్మంపై స్పర్శలేని రాగి వర్ణం గల మచ్చలపై అశ్రద్ధ చెయొద్దని వైద్యాధికారి హిమబిందు సూచించారు. రేగొండ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు కుష్టుపై రేగొండ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడారు. కార్యక్రమంలో సీహెచ్‌వో, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాజేడు పీహెచ్‌సీలో అందుబాటులో లేని వైద్యులు

- నిత్యం ఇద్దరిలో ఒక్కరు మాత్రమే విధుల్లో..
- ఇబ్బందులు పడుతున్న రోగులు

పీహెచ్‌సీలో ఖాళీగా దర్శనమిస్తున్న వైద్యుడి కుర్చీ

వాజేడు, ఫిబ్రవరి 2 : మండలకేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యులు అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలు కొద్దికాలంగా వినిపిస్తున్నాయి. వైద్యంకోసం గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన ఆరోగ్యమిత్రగా పనిచేసే గజ్జల కృష్ణ ఆదివారం ఉదయం 11:30 నిమిషాలకు పీహెచ్‌సీకి వచ్చాడు. కాగా వైద్యులు అందుబాటు లేకుండా ఖాళీగా వైద్యుడి కుర్చి దర్శనమిచ్చినట్లు ఆరోపించాడు. స్టాఫ్ నర్స్ మంగ పరీక్షించి సెలైన్ పెట్టి వైద్యం అందించినట్లు పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పనిచేసే వైద్యులు అందుబాటులో లేకపోవడంపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయ పేర్కొన్నారు. ఇక్కడ ఇద్దరు వైద్యాధికారులు ఉండగా అందులో తరచూ ఒక్కరు మాత్రమే ఉంటూ మరొకరు చుట్టపుచూపుగా వచ్చిపోతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి ఆదివారం ఒక్కరు కూడా అందుబాటులో ఉండడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ లేదా వైద్యశాఖ ఉన్నతాధికారులు ఏజెన్సీలోని పీహెచ్‌సీలు, పల్లె దవాఖానలను నిత్యం పర్యవేక్షించాలని మండల వాసులు కోరుతున్నారు. ఈ విషయంపై జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌వో) గోపాల్‌రావును 'నమస్తే తెలంగాణ' ఫోన్లో వివరణ కోరగా మధ్యాహ్నం నుంచి వైద్యులు బయటకు వెళ్లినట్లు తెలిసిందన్నారు. అందుబాటులో ఉండి వైద్యం అందించని వైద్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

మేడారంలో భక్తుల రద్దీ

- సౌకర్యాలు లేక ఇబ్బందులు
- మినీ జాతర సమీపిస్తున్నా పూర్తి కాని పనులు

సమ్మక్క దేవత గద్దెను దర్శించుకుంటున్న భక్తులు

తాడ్వాయి, ఫిబ్రవరి 2 : సమ్మక్క-సారక్క దేవతల గద్దెలు భక్తులతో నిండిపోయాయి. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 30వేల మంది భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. గిరిజన సాంప్రదాయ పద్ధతులలో మొక్కులు చెల్లించుకున్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. కాగా, మినీ జాతర సమీపిస్తుండటంతో వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు మేడారానికి క్యూ కడుతున్నారు. జాతరకు మరో ఎనమిది రోజులే గడువు ఉన్నప్పటికీ భక్తులకు ఏ ఒక్క సౌకర్యం కూడా కల్పించలేదు. దీంతో ముందస్తు మొక్కులు చెల్లించేందుకు వచ్చిన భక్తులకు తిప్పలు తప్పడం లేదు. భక్తులు పుణ్యాస్నానాలు ఆచరిచేందుకు ఐబీశాఖ ఆధ్వర్యంలో జంపన్నవాగు స్నానఘట్టాలపై బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ ఏర్పాట్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో జాతర పరిసరాల్లో తాగునీటి ఏర్పాట్ల పనులు ఇంకా పునాది దశలోనే ఉన్నాయి. కొన్ని చోట్ల ట్యాప్‌లు బిగించినా కనెక్షన్‌లు ఇవ్వకపోవడంతో నీటి సరఫరా చేయడంలేదు. తాత్కాలిక మరగుదొడ్ల ఊసేలేదు. తాగునీరు లేకపోవడంతో మినరల్ వాటర్ ప్లాంట్లకు క్యూలు కడుతున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో వ్యాపారులు 20 లీటర్ల ఒక్కో క్యాన్‌ను రూ.50 నుంచి రూ.70కి విక్రయిస్తున్నారు. చేతి పంపుల వద్ద భక్తులు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మహిళా భక్తుల కోసం స్నానఘట్టాల వద్ద చాటు గదుల పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. వాగులోని ఇన్‌ఫిల్టరేషన్ బావుల పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్తున్న అధికారుల ప్రకటనలపై ముందస్తు దర్శనానికి వచ్చిన భక్తులు సౌకర్యాలు అందకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేలమంది భక్తులకే ఏర్పాట్లు చేపట్టలేకపోతున్న అధికారులు మినీ జాతరకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఏం సౌకర్యాలు కల్పిస్తారో అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మేడారంలో ప్రైవేట్ వ్యక్తులు రెండు వధశాలలను నిర్వహిస్తున్నారు. భక్తుల రద్దీతో యాటపోతులను కోసేందుకు గంటల సమయం పడుతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయమై దేవాదాయశాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరో రెండు వధశాలలు ఏర్పాటు చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

చేతిపంపు వద్ద నీటి కోసం వేచి ఉన్న భక్తులు

గట్టమ్మ వద్ద పనులు షురూ..

ములుగురూరల్ : ములుగు జిల్లా కేంద్రం పరిధిలోని ఆది దేవత గట్టమ్మ దేవాలయం వద్ద ఈ నెలలో జరుగనున్న మినీ మేడారం జాతర సందర్భంగా పనులు దేవాదాయశాఖ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఈవో మాట్లాడుతూ గట్టమ్మ దేవాలయానికి, వాటర్ ట్యాంకులు, టాయిలెట్లకు రంగులు వేయించినట్లు తెలిపారు. ఆలయ పరిసరాలను డోజర్‌తో చదును చేయించి శుభ్రం చేశామన్నారు. లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

ప్రజల ఆరోగ్యం కోసమే ఉచిత వైద్య శిబిరం

ఏటూరునాగారం, ఫిబ్రవరి 2 : ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు ఎస్సై తాజుద్దిన్, సాయిబాబా ఆలయకమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం ఏటూరునాగారంలోని న్యూవన్ అపోలో హాస్పిటల్, వరంగల్‌లోని ధాత్రి హాస్పిటల్ సహకారంతో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పేద మధ్య తరగతికి చెందిన వారు ఎక్కువగా ఈ ప్రాంతంలో ఉండడంతో వైద్య శిబిరాన్ని సాయిబాబా ఆలయ కమిటీ, పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 250 మందికి వైద్య పరీక్షలు చేసి రూ.1.5లక్షల విలువ చేసే మందులను ఉచితంగా అందజేశామన్నారు. శిబిరంలో అధునాతన వైద్య పరికరాలతో పరీక్షలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు అంబటి విజయ్‌కుమార్, దేవులపల్లి నమ్రత, డీ రామారావు, అనీల్‌రాజు, సిబ్బంది వెంకటేశ్, నిఖిత, రమేశ్, రాకేశ్, అంకిత, సృజన్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

ములుగురూరల్/వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి 2 : మల్లంపల్లి మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2005-2006 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. నాడు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం చిన్న నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులు స్వరూప రాణి, శేషగిరి, సుదర్శనాచారి, వెంకటచలం, నవీన్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు. అలాగే, వెంకటాపురం(నూగూరు)లోని జడ్పీఎస్ ఉన్నత పాఠశాలకు చెందిన 2002-2003 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు బెజ్జని రజిత, మమత పాల్గొన్నారు.

వెంకటాపూరం(నూగూరు) : పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ములుగురూరల్ : మల్లంపల్లిలో..

క్రీడల్లో రాణించిన పోలీసులకు అభినందన

విజేతలను అభినందిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 02: కరీంనగర్ లో పోలీసులు ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ క్రీడల్లో భూపాలపల్లి జిల్లాకు చెందిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఏఆర్ పోలీస్ కానిస్టేబుళ్లు శశిధర్, రమీజ్ హుస్సేన్‌లు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి కాంస్య పథకాన్ని గెలుపొందారు. ఈ సందర్భంగా